అడ్మిషన్లు జరుగుచున్నవి
రవాణా సదుపాయం కలదు
డాక్టర్ దండి సూర్యనారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి
శ్రీ శ్రద్ధ ప్లేస్కూల్
Right Place for Right Education
(LKG to 5th Class) A/C
కామేశ్వరి కళ్యాణమండపం దగ్గర, నందల జంక్షన్, నక్కవీధి, కలెక్టర్ బంగ్లా రోడ్డు, శ్రీకాకుళం. 99893 03703

శ్రీశ్రీశ్రీ సంజీవరాయస్వామి ఆలయం
సఖియా మఠం, బాయమ్మతోట, చిన బొందిలీపురం, శ్రీకాకుళం
ఆహ్వానం
శనిత్రయోదశి
తేది 17-08-2024 శనివారం
ఈ ఆలయంలో శనిత్రయోదశి సందర్భంగా ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించబడిన జిల్లాలోనే అరుదైన 3 అడుగులు ఎత్తుగల శ్రీశనైశ్చర విగ్రహానికి మీ స్వహస్తాలతో ప్రప్రథమ తైలాభిషేకం
(ఉదయం : 5 గం॥ల నుండి మధ్యాహ్నం 12 గం॥ల వరకు)
చేయుటకు తరలిరండి. దర్శించి తరించండి.
ఈ నెలలోనే 2వ శనిత్రయోదశి: తేది 31-8-2024 శనివారం కూడా ఈ విధంగా జరుగును.
ఆలయంలోపల గల శ్రీ శనైశ్చరుని సన్నిధి.
- ఆలయ ధర్మకర్త.
- విశ్వజయము గ్రూప్ భక్త బృందం సౌజన్యంతో
సెల్: 92466 31755



TET - సైకాలజీ, తెలుగు ఇంగ్లీష్
DSC - SGT, SA - సోషల్, తెలుగు, బయాలజీ
సోషల్ మెథడ్స్- ఉపేంద్రనాయుడు సార్ - జూలై 7th
సైకాలజీ, ట్రైమెథడ్స్, PIE- సైదులు సార్ - జూలై 12,13,14
రైల్వే(RRB)/SSC/కానిస్టేబుల్స్/SI/BANK
RPF AP
స్పెషల్ బ్యాచ్: అర్థమెటిక్, రీజనింగ్, ప్యూర్ మేథ్స్ 'చలం' రవి, M.వేణుగోపాల్, మల్లిక్, Ch.శంకర్, కృష్ణమూర్తి, Sirsచే
9AM - 7PM సెమినార్, 10 రోజులు ఫ్రీ డెమో క్లాసులు
SOLVE ACADEMY
పౌర గ్రంథాలయం, వైజాగ్-16 | RTC కాంప్లెక్స్, శ్రీకాకుళం
7569089825, 8688172010

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
శుక్రవారం 16-8-2024
సంపుటి: 20 సంచిక: 123
పేజీలు: 4 వెల: రూ.1

## వీనస్ కేశవ ఆకస్మిక మృతి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)
నగరంలో అతి పురాతన హోటల్ వీనస్ యజమానుల్లో ఒకరైన ఎల్లూరి కేశవ (55) శుక్రవారం ఆకస్మికంగా మృతిచెందారు. రెండు రోజుల క్రితం స్థానిక ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో హెర్నియాకు సర్జరీ చేయించుకున్న కేశవ శుక్రవారం డిశ్చార్జి కానుండగా, అదే సమయంలో ఫిట్స్ రావడంతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారని ఆయన మిత్రులు చెబుతున్నారు. 1975లో జీటీ రోడ్డులో వీనస్ హోటల్‌ను కర్నాటకలో ఉడిపి నుంచి వచ్చిన ఎల్లూరి పురుషోత్తం స్థాపించారు. అప్పటి నుంచి నగరంలో వీనస్ హోటల్ నడుస్తునే ఉంది. కేశవకు ఒక కుమారుడు, భార్య ఉన్నారు. కేశవ గత కొద్దికాలంగా శారీరక రుగ్మతలతో బాధపడుతున్నారు. భార్య కూడా ఇటీవల అనారోగ్యం పాలు కావడంతో కేశవ కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేపర్ బాయ్స్
కావలెను
సంచలన సాయంకాల పత్రిక 'సత్యం'లో పని చేసేందుకు పేపర్‌బాయ్స్ కావలెను.
- సంప్రదించండి -
94414 66455





సంచలన సాయంకాల పత్రిక 'సత్యం' వెబ్ పేజీ (https://www.satyamdaily.net/)ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కలిసి ప్రారంభించారు.

## 'సత్యం' వెబ్‌పేజీ ప్రారంభించిన కలెక్టర్

**- వాస్తవికతకు అద్దంపట్టే కథనాలు రావాలి: ఎస్పీ, జేసీ -**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)
78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన తేనేటి విందు కార్యక్రమంలో 'సత్యం' వెబ్‌పేజీపై పబ్లిష్ బటన్‌ను కలెక్టర్ ప్రెస్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాస్తవికతకు అద్దం పట్టే కథనాలు రావాలని సూచించారు. సాంకేతిక దిశగా ప్రపంచం ముందుకు దూసుకుపోతున్న తరుణంలో డిజిటల్‌గా పాఠకులకు సమాచారం అందించడానికి కృషి చేస్తున్న 'సత్యం' యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సత్యం బ్యూరో ఇన్‌ఛార్జి బగాది నారాయణ రావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా 2005లో ప్రచురణ ప్రారంభించిన 'సత్యం' పత్రిక 19 ఏళ్లు పూర్తి చేసుకొని 20వ యేట అడుగుపెట్టిన శుభసందర్భంగా 'సత్యం' వెబ్‌పేజీని డిజిటల్‌గా తీసుకువచ్చినట్లు ఉన్నతాధికారులకు వివరించారు. ఎడిటర్ ఎన్‌వీఎస్ ప్రసాద్ ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సత్యం పత్రికను ఈ స్థాయిలో నిలబెట్టారని వివరించారు. సత్యం పత్రిక ఇంత ఆదరణ పొందడానికి పాఠకులు, చందాదారులు, ప్రకటనకర్తల ఆదరాభిమానాలేనని వివరించారు. వీరి స్ఫూర్తితోనే డిజటల్ వేదికపై 'సత్యం' పత్రికను ఆవిష్కరించగలిగామన్నారు. 13 మంది సిబ్బందితో నిత్యం పాఠకులకు వార్తల్లో కొత్తదనాన్ని అందించడానికి 'సత్యం' నిరంతరం కృషి - మిగతా 4లో



## సేవాలోపమే రిమ్స్ స్పెషాలిటీ!



సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయంటూ ఫొటో దిగిన వైద్యులు



మూలకు చేరిన పీఎం కేర్ యూనిట్లు

- స్థాయి, వసతులు పెరిగినా సేవలు మృగ్యం
- అడగడుగునా నిర్లక్ష్యంతో రోగులకు నరకం
- చాలా పోస్టులు ఖాళీ.. ఉన్నవారిలో అలసత్వం
- ఫేస్ యాప్‌ను మేనేజ్ చేసి విధులకు డుమ్మా
- జిల్లా సర్వజన ఆస్పత్రి వైపు చూడని కలెక్టర్లు, మంత్రులు

కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత నెల 17న మంత్రి అచ్చెన్నాయుడు ప్రభుత్వ సర్వజన అస్పత్రి (రిమ్స్)లో సమీక్ష నిర్వహించి మెరుగైన వైద్య సేవలతో మిగతా ఆస్పత్రులకు ఆదర్శంగా నిలవాలని వైద్యాధికారులకు హితవు పలికారు. ఈయనొక్కరే కాదు.. 2010 నుంచి మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ప్రజాప్రతినిధులంతా పలుమార్లు రిమ్స్‌ను సందర్శించి సమీక్షలు నిర్వహించడం, వైద్యసేవలు మెరుగుపడాలని హెచ్చరించి వెళ్లిపోవడం జరుగుతోంది. కానీ పరిస్థితి మాత్రం మారడంలేదు. కోవిడ్ పుణ్యమా అని రిమ్స్‌లో వసతులు పెరిగాయి. ఆధునిక వైద్య పరికరాలు సమకూరాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 22న కార్డియాలిజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, సీటీ సర్జరీ, యూరాలజీ, మెడికల్ ఆంకాలజీ వంటి ఆరు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పూర్తిస్థాయిలో భవనాలు అందుబాటులోకి వచ్చాయి. అయినా రోగులకు అరకొర సేవలే అందుతున్నాయి. వైద్యులు పూర్తిస్థాయిలో లేకపోవడం, ఉన్నవారు స్థానికంగా నివాసం ఉండకపోవడం, సిబ్బంది సమయపాలన పాటించకపోవడం వంటి అనేకానేక సమస్యలతో రిమ్స్‌కు వచ్చే రోగులకు సక్రమంగా సేవలు అందడంలేదు. - వివరాలు 4లో



హార్దిక శుభాకాంక్షలు
హారికా కనస్ట్రక్షన్ సిబ్బంది మరియు లైన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి శ్రీకాకుళం ప్రతినిధులు
లైన్స్‌క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి ఉత్తమ సామాజిక సేవలకు గాను గౌరవ వ్యవసాయ శాఖామంత్రి శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారు, జిల్లా కలెక్టర్ శ్రీ స్వప్నిల్ దినకర్ గారు, ఎస్పీ శ్రీ కె.వి.మహేశ్వరరెడ్డి గారు, జాయింట్ కలెక్టర్ శ్రీ అహ్మద్‌ఖాన్ గారు, ఎమ్మెల్యే శ్రీ గొండు శంకర్ గారి చేతుల మీదుగా అవార్డును అందుకున్న లైన్స్ హర్షవల్లి వ్యవస్థాపకులు శ్రీ హేమంత ప్రసాద్ గారికి శుభాకాంక్షలు..



హార్దిక శుభాకాంక్షలు
బి.ఆర్.ఆర్. వంశధార ప్రాజెక్టు సర్కిల్, శ్రీకాకుళం కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధినిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ.. సాయమన్నవారికి నేనున్నాననే సహాయం చేస్తూ..
ఏపీ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నిత్యం ఉద్యోగుల సమస్యలపై గళమెత్తే ఉద్యమ నాయకుడు
గౌ॥ రఘుపాత్రుని గోవింద్ పట్నాయిక్ గారికి
78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న శుభసందర్భంగా ఇవియే మా హృదయపూర్వక శుభాకాంక్షలు..
సాహినీ మల్లిఖార్జున పట్నాయిక్
విజయలక్ష్మి పట్నాయిక్
ప్రొ: యాపిల్ స్వీట్స్ & బేకరీ,
ముస్లిమ్ కాంప్లెక్స్, పాలకొండ, 9440321703
డబ్బీరు శ్రీనివాసరావు (వాసు)
అధ్యక్షులు, శిష్టకరణ సంఘం, శ్రీకాకుళం టౌన్,
కార్యవర్గ సభ్యులు, శ్రీకాకుళం జిల్లా



## పేదల సంక్షేమమే కూటమి లక్ష్యం

- చంద్రబాబు మానస పుత్రిక అన్న క్యాంటీన్
- అధికారంలో లేకున్నా అన్న క్యాంటీన్ కొనసాగించాం
- పేదవాడి పొట్టకొట్టిన దుర్మార్గుడు జగన్
- అన్న క్యాంటీన్‌కు దాతలు విరాళాలు ఇవ్వండి
- ప్రారంభోత్సవంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్న



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)
కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని వ్యవసాయ, మార్కెటింగ్, పశుసంవర్థక, డైరీ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఏడురోడ్ల కూడలిలోని దివంగత మహానేత ఎన్‌టీ రామారావు, దివంగత కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నగరంలోని ఏడురోడ్ల కూడలి, పాతబస్టాండ్‌లలో మంత్రి అచ్చెన్నాయుడు అన్న క్యాంటీన్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కడుపునిండా భోజనం పెట్టే ఈ గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మానసపుత్రిక అన్న క్యాంటీన్ అని, ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. సేవాభావంతో ముందుకు వచ్చి అన్న క్యాంటీన్లకు విరాళాలు ఇచ్చి పేదల కడుపు నింపడంలో మీవంతు పాత్ర పోషించాలని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. డొక్కా సీతమ్మ, దివంగత మహానేత ఎన్‌టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు నాయుడు 2014 నుంచి 2019 మధ్య రాష్ట్ర వ్యాప్తంగా 200కు పైగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారని, పేదవాడి కడుపు నింపేందుకు భవనాలు నిర్మించి పరిశుభ్ర వాతావరణంలో నాణ్యమైన భోజనాన్ని రూ.15కే అందించామని చెప్పారు. అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత అన్న క్యాంటీన్లు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఓ నరరూప రాక్షసుడని, అన్నాక్యాంటీన్లను మూసివేయవద్దని ఆయనకు దండాలు కూడా పెట్టామని తెలిపారు. ఈ పథకం ప్రభుత్వానికి భారం కాదని, దాతలు వస్తారని, పథకం కొనసాగించాలని పట్టించుకోలేదని చెప్పారు. సొంత డబ్బులతో అన్నక్యాంటీన్లు పెడతామంటే వాటి కోసం వేసిన షెడ్లను కూడా తొలగించి అన్న క్యాంటీన్ అనే మాట కూడా విన్పించకుండా చేయాలని జగన్ కుట్ర పన్నారని వివరించారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు సర్కార్ ఏర్పాటవటంతో అన్న క్యాంటీన్లు పునః ప్రారంభం అవుతున్నాయని చెప్పారు. తొలిదశలో భాగంగా 100 క్యాంటీన్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు. త్వరలో మండల పరిధిలో కూడా అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు.

**శంకర్ గొప్ప మానవతావాధి**

రాష్ట్రంలో అన్నక్యాంటీన్లు మూతపడిన తర్వాత పేదల, రోజువారీ కూలీల కడుపు నింపాలన్న ఆలోచనతో టెక్కలి, పాతపట్నంలో, శ్రీకాకుళం నగరంలో అన్నక్యాంటీన్లు ప్రారంభించాలని పిలుపునిచ్చానని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో గొండు శంకర్ నగర పరిధిలో ఐదు చోట్ల మొబైల్ వ్యాన్లను ఏర్పాటు చేసి 484 రోజులు సొంత ఖర్చులతో అన్న క్యాంటీన్‌ను కొనసాగించాడని మంత్రి తెలిపారు. మండుటెండల్లోనూ, జోరు వానల్లోనూ, పండుగలున్నా, బంద్‌లున్నా ఏనాడూ అన్నక్యాంటీన్ మూసివేయకుండా నిర్విరామంగా కొనసాగించిన గొప్ప మానవతావాది గొండు శంకర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన సహాయకులకు అభినందిస్తూ మంత్రి సన్మానం చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, కమిషనర్ చల్లా ఓబులేష్, బీజేపీ నాయకులు పైడి వేణుగోపాలం, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలకు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



• ఎడిటోరియల్

# ఐపీఎస్‌లకు సంతకాల శిక్ష సమంజసమేనా!

వారానికోసారి పోలీసు స్టేషన్‌కు వచ్చి కనిపించాలి. రిజిస్టర్‌లో సంతకం చేయాలి. సాధారణంగా క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి బెయిల్ మంజూరు చేసినప్పుడు కోర్టులు ఈ షరతు విధించడం అందరికీ తెలిసిందే. దీన్నే కండీషనల్ బెయిల్(షరతులతో కూడిన బెయిల్) అంటుంటారు. చిత్రమేమిటంటే నిందితుల విషయంలో ఇది షరతు మాత్రమే. కానీ ఇటువంటి కేసులను విచారించే పోలీస్ బాస్‌లకు ఇప్పుడు అది శిక్షగా పరిణమించింది. వివిధ హోదాల్లో ఉన్న 16 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులకు రోజూ కార్యాలయానికి వచ్చి హాజరుపట్టీలో సంతకం చేసి వెళ్లాలని రాష్ట్ర పోలీస్ బాస్ అయిన డీజీపీ ద్వారకా తిరుమల రావు శిక్ష వేశారు. అది కూడా సంతకం పెట్టి, ముఖం చూపించి వెళ్లిపోవడం కాదండోయ్. మంగళగిరిలోని రాష్ట్ర డీజీపీ కార్యాలయం పని వేళలైన ఉదయం పది గంటలకు ఠంచనుగా వచ్చి.. సాయంత్రం ఆరు గంటల వరకు అక్కడి వెయింటింగ్ హాల్లో ఉండి అప్పుడు సంతకం పెట్టి వెళ్లాలి. నిజంగా దీన్ని శిక్ష అనే కంటే తీవ్ర అవమానమనే చెప్పాలి. డీజీపీ తీసుకున్న ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెయింటింగులో ఉన్నా ప్రధాన కార్యాలయానికి అందుబాటులో లేరన్న కారణంతో 16 మంది సీనియర్ ఐపీఎస్‌లకు ఈ మేరకు డీజీపీ కార్యాలయం మెమోలు జారీ చేసింది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాడిన తర్వాత భారీ ఎత్తున ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. ఇందులో భాగంగా కొందరు కీలక పోస్టుల్లోకి వెళ్లగా గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న, వైకాపా కనుసన్నల్లో పని చేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నవారిని లూప్‌లైన్ పోస్టుల్లోకి నెట్టేశారు. ఇంకా పలువురిని వెయిటింగ్‌లో పెట్టారు. సాధారణంగా ప్రభుత్వాలు మారినప్పుడు ఐఏఎస్, ఐపీఎస్‌తో పాటు ఇతర కీలక అధికారుల బదిలీలు జరుగుతుంటాయి. ఏ ప్రభుత్వమైనా తమ విధానాలకు అనుకూలంగా పనిచేసే అధికారులనే ముఖ్యమైన పోస్టుల్లో పెట్టాలనుకుంటుంది. ఇప్పుడూ అదే జరిగిందనుకోవచ్చు. అలాగే ప్రభుత్వం మారిన సందర్భంలో తమకు ఇబ్బంది ఏర్పడుతుందని భావించే ఐఏఎస్, ఐపీఎస్‌లు ముందుజాగ్రత్తగా కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తుంటారు. అది కుదరనివారు మాత్రం బదిలీ వేటుకు గురై అప్రాధాన్య పోస్టుల్లోకి వెళుతుంటారు. పోస్టింగ్ లేకుండా వెయింటింగ్‌లో ఉన్నవారి గురించి ఇప్పటివరకు ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకున్న దాఖలాల్లేవు. సదరు అధికారులే నానాపాట్లు పడి మళ్లీ పోస్టింగ్ పొందేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ ఇప్పటికే వెయిటింగ్ పేరుతో శిక్ష అనుభవిస్తున్నవారిని మళ్లీ సంతకాలంటూ రోజంతా వెయిటింగ్ శిక్ష వేయడం చర్చనీయాంశంగా మారింది. సీనియర్ ఐపీఎస్ అధికారులను ఇటువంటి శిక్షకు గురిచేస్తున్నవారు ఐఏఎస్‌ల విషయంలోనూ దీన్ని అమలు చేయగలరా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే.. ప్రభుత్వం మారిన వెంటనే గత ప్రభుత్వానికి అనుకూలంగా అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారంటూ చాలామంది సీనియర్ ఐఏఎస్ అధికారులను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. పలువురిని వెయిటింగులో కూడా పెట్టింది. అయితే దీనిపై ప్రభుత్వ వాదన వేరేగా ఉంది. గత ప్రభుత్వంలో వైకాపాకు, ఆ ప్రభుత్వ పెద్దలకు వంతపాడిన ఐపీఎస్ అధికారులు ఇప్పుడు పోస్టింగ్ లేకపోయినా వైకాపా నేతలపై నమోదైన కేసుల విచారణలో జోక్యం చేసుకుంటున్నారట. ఆయా కేసుల విచారణాధికారులను పిలిపించి కేసుల తీవ్రత తగ్గించాలని, నీరుగార్చాలని ఒత్తిడి చేస్తున్నారన్నది ప్రభుత్వవర్గాల వాదన. ఈ మేరకు ఇంటెలిజెన్స్ నివేదించిందని సమాచారం. దీన్ని అడ్డుకునేందుకే 16 మంది సీనియర్ ఐపీఎస్‌లకు మెమో జారీ చేశారంటున్నారు. ఈ మెమోలు అందుకున్నవారిలో సంజయ్‌కుమార్, పీఎస్‌ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా టాటా, కొల్లి రఘురామిరెడ్డి, సునీల్ కుమార్, అమ్మిరెడ్డి, విశాల్‌గున్ని, రిషాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు. డీజీపీ నిర్ణయంపై అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి స్పందిస్తూ దారుణమైన వ్యాఖ్యలు చేశారు. పోలీసు అధికారుల పరిస్థితి రాజకీయ నేతల కంటే దారుణంగా తయారైందన్నారు. తాము కేసుల్లో చిక్కుకుని జైలుపాలైతే కండీషనల్ బెయిల్ పొంది కోర్టు సూచన మేరకు అప్పుడప్పుడూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం పెడితే సరిపోతుందన్నారు. ఇప్పుడు పోలీస్ బాస్‌ల పరిస్థితి అంతకంటే హీనంగా తయారైందన్నారు. సంతకం పెట్టడంతో పాటు రోజంతా వెయిటింగ్ హాల్లో కూర్చోవడం నరకప్రాయమని వ్యాఖ్యానించారు. ఇక ఇదే అంశంపై మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. ఏపీ పోలీస్ బాస్ తన కార్యాలయ వెయిటింగ్ హాల్‌ను ఖైదీలను శిక్షించే కాన్సెంట్రేషన్ సెల్‌గా మార్చేశారని విమర్శించారు. లక్షల రూపాయల వేతనాలు పొందుతున్న అత్యున్నత పౌర సర్వీసులకు చెందిన సీనియర్ అధికారులను వెయిటింగ్ హాల్లో మగ్గబెట్టడం ద్వారా ఏం సాధించాలనుకుంటున్నారని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయడం అధికారుల కర్తవ్యమని గుర్తు చేశారు. ఒకవేళ అలా పనిచేయకపోతే.. వారిని ప్రభుత్వానికి వ్యతిరేకులుగా ముద్రవేస్తారని వ్యాఖ్యానించారు. అధికారులు ఏమైనా తప్పులు చేస్తే వాటిపై విచారణ జరిపి డిసిప్లినరీ యాక్షన్ లేదా క్రిమినల్ చర్యలు తీసుకోవడంలో ఎవరికీ అభ్యంతరం ఉండదని అన్నారు. అటువంటివేవీ లేకుండా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఉన్నతాధికారులందరినీ ఒకేచోట కట్టగట్టి రోజంతా కూర్చోబెట్టడం మానసికంగా హింసించడమేనని ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యానించారు.






ఆమె పుట్టుక స్విట్జర్లాండైనా ఆమె ఆత్మ మాత్రం భారత్. త్రివిధ దళాల్లో సైనికులకిచ్చే అత్యున్నత పురస్కారమైన పరమ్ వీర్ చక్ర రూపకర్త కూడా హృదయమంతా భారతీయతను నింపుకున్న ఆ స్విస్ దేశస్థురాలేనన్నది బహుశా చాలా తక్కువ మందికి తెలిసిన విషయమేమో..?! ఆమే.. సావి త్రిభాయ్ ఖనోల్కర్‌గా తన పేరు మార్చు కున్న ఈవ్ వొన్నే మడే డి మారోస్.

# ఆ విదేశీ వనిత.. పరమ్ వీర్‌చక్ర రూపకర్త!

స్విట్జర్లాండ్‌లోని న్యూచాటెల్‌లో జన్మించిన ఈవ్ వొన్నే మడే డి మారోస్.. 19 ఏళ్ల యుక్తవయస్సులోనే భారత్‌ను సందర్శించింది. ఆ తర్వాత భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు, భిన్నకులమతాల వ్యవస్థల్లో కనిపించే జీవ వైవిధ్యం ఆమెను అమితంగా ఆకర్షించాయి. అదే అదనుగా ఆమె భారతీయ మూలాలపై దృష్టి సారించింది. ఎంతగా అంటే ఇక్కడ భారతీయులమని చెప్పుకునే ఎందరికంటేనో కూడా ఆమె ఇక్కడి కళలు, సంగీతం, నృత్యం, భాషాశాస్త్రం, ఆధ్యాత్మికత, పురాణాలు, పురాతన గ్రంథాలు, సాంస్కృతిక సంపదపై అపార జ్ఞానాన్ని సముపార్జించింది.

అలా ఆమె భారత్‌లో పర్యటిస్తున్న క్రమంలోనే.. యూకేలోని రాయల్ మిలిటరీ అకాడమీలో శిక్షణ పొందుతున్న యువ సైనికాధికారైన మహారాష్ట్రియన్ విక్రమ్ ఖనోల్కర్‌తో ప్రేమలో పడింది. ఆ తర్వాత ఆయన్నే వివాహమాడి 1932లో ఈవ్ వొన్నే మడే డి మారోస్ కాస్తా తన పేరును సావిత్రీభాయి ఖనోల్కర్‌గా మార్చేసుకుంది.

బ్రిటీష్ కబంధ హస్తాల నుంచి భారత్‌కు విముక్తి లభించి స్వాతంత్ర్యం అనుభవించేందుకు సిద్ధమవుతున్న రోజులవి. బ్రిటీష్ పాలనా పద్ధతులు, నియమాలు, నిబంధనల వంటివాటిని పూర్తిగా తుడిచిపెట్టి భారత్ తన సొంత అస్తిత్వం కోసం సిద్ధమవుతున్న తరుణాన ప్రణాళికలు రచిస్తున్న కాలమది. అలాంటి సమయంలో అప్పుడు భారతసైన్య సహాయక జనరల్‌గా ఉన్న మేజర్ జనరల్ హీరాలాల్ అటల్‌కు ఆ బాధ్యతలను అప్పగించినప్పుడు స్వదేశీ కాకున్నా.. భారత్‌పై సావిత్రీ భాయి ఖనోల్కర్‌కున్న లోతైన జ్ఞానం హీరాలాల్‌ను అమితంగా ఆకట్టుకుంది. దాంతో స్వాతంత్ర్యం తెచ్చుకున్న భారత్‌ను కొత్తగా రూపొందించే ప్రణాళికా బృందంలో ఈవ్ వొన్నే మడే డి మారోస్ భాగస్వామురాలైంది.

ఈ క్రమంలోనే సైనికులు ప్రదర్శించే శౌర్యానికిచ్చే పురస్కార పతకం తయారీకి బీజం పడింది. దేశ సరిహద్దుల్లో కంటిమీద రెప్ప వాల్చకుండా.. ఎందరో గుండెల మీద చేయి వేసుకుని నిద్రించేలా జాతి కోసం పోరాడే సైనికులకిచ్చే పురస్కారమంటే మాటలా..? అది వారి జీవిత సాఫల్య కృషికి ఓ గుర్తింపుగా వారు భావించే ఓ అద్భుతమైన గౌరవ చిహ్నం. అలా పరమవీర చక్ర పురస్కార చిహ్నాన్ని డిజైన్ చేసిన ఘనతలో ఈవ్ వొన్నే మడే డి మారోస్‌ది ప్రధాన పాత్రైంది. అందుకు ఆమెకు వ్యూహంలోనూ, ధైర్యంలోనూ యోధుడైన ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తయ్యాడు. అందుకే పరమ్ వీర్ చక్ర పురస్కార చిహ్నంపై సాక్షాత్తూ భవానీ మాతే ఆయనకిచ్చినట్టు పురాణాలు పేర్కొనే రెండువైపులా కొస్సెటిదనంతో కనిపించే వజ్రాయుధంగా పిల్చే ఆ కత్తి ఆకారాన్ని ముద్రించారట.

వృత్తాకార కాంస్య రూపంలో కనిపించే ఈ పతకం.. ముందువైపు భారతదేశ చిహ్నం.. దాని చుట్టూ నాలుగు వజ్ర నమూనాలు కనిపిస్తాయి. దధీచి అనే రుషి తన శరీర ఎముకలను వజ్రాయుధంగా రూపొందించడానికి త్యాగం చేయడంతో తయారైన వజ్ర నమూనా అదని పురాణాలు చెప్పే మాట. వెనుకవైపున పరమవీర్ చక్ర్ అని హిందీలో.. అలాగే ఆంగ్లంలోనూ రెండు కమలాల మధ్య లిఖితమై ఉంటుంది. ఊదా రంగు రిబ్బనుతో మెడలో వేయడానికి అనుగుణంగా ఈ కాంస్య పురస్కారాన్ని రూపొందించారు. అలా 1950లో మొట్టమొదటిసారి జరుపుకున్న గణతంత్ర దినోత్సవాన సావిత్రి ఖనోల్కర్



అల్లుడైన సురేంద్రనాథ్ శర్మ సోదరుడు మేజర్ సోమనాథ్ శర్మ 1947లో పాకిస్థాన్‌పై జరిగిన యుద్ధంలో ప్రదర్శించిన ధైర్యసాహసాలకు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అలా నాటి సోమ్‌నాథ్ శర్మ నుంచి మేజర్ విక్రమ్ బాత్రా వరకూ ఆ పతకాన్నందుకున్నవారు 21 మంది కాగా, 14 మందికి మరణానంతరం అందించగా, మరో 16 మంది భారత్–పాక్ యుద్ధాల్లో పాల్గొన్న సైనికులకు వారి ధైర్యసాహసాలకు గుర్తింపుగా అందజేశారు. అంతేకాదు, యుద్ధ సమయాల్లో దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన ఎందరో సైనిక కుటుంబాలతో పాటు దేశ విభజన సమయంలో బాధితులైన వారికి ఆమె చేసిన సామాజిక సేవ కూడా ఎప్పటికీ మరువలేనిది. తన భర్త విక్రమ్ మరణానంతరం రామకృష్ణ మఠం కేంద్రంగా ఆమె పూర్తిగా ఆధ్యాత్మిక బాటలో తన జీవితాన్ని గడిపారు. అంతేకాదు సెయింట్స్ ఆఫ్ మహారాష్ట్ర పేరుతో ఓ పుస్తకాన్నీ రాశారు. ఇదండీ భారతీయ మూలాలను ఇష్టపడిన ఓ విదేశీ వనిత.. ఆమె చేతిలో రూపుదిద్దుకున్న పరమ్ వీర్ చక్ర పతకం కథ!

– రమణ కొంటికర్ల




ఐదేళ్ల కిందట పూరి జగన్నాథ్-రామ్ కాంబినేషన్లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' పెద్ద హిట్ అయింది. దాని తర్వాత 'లైగర్'తో పెద్ద షాక్ తిన్న పూరి.. ఇప్పుడు 'ఇస్మార్ట్ శంకర్' సీక్వెల్ 'డబుల్ ఇస్మార్ట్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

**కథ:** తనకు తాను చాలా తెలివైనవాడిని అని అనుకుని తన పేరు వెనుక 'ఇస్మార్ట్' అని తగిలించుకున్న హైదరాబాద్ పాతబస్తీ కుర్రాడు శంకర్ (రామ్ పోతినేని) దొంగతనాలు చేస్తూ బతుకుతుంటాడు. తన చిన్నతనంలో తల్లిని కళ్ల ముందే చంపేసిన మాఫియా డాన్ బిగ్ బుల్ (సంజయ్ దత్)ను ఎలాగైనా చంపాలన్న లక్ష్యంతో అతనుంటాడు. ఆ సమయంలోనే తన జీవితంలోకి జన్నత్ (కావ్య థాపర్) వస్తుంది. శంకర్ ఆమె వెనుక తిరుగుతూ సాగిపోతున్న సమయంలో విదేశాల్లో ఉంటున్న బిగ్ బుల్ కు బ్రెయిన్ ట్యూమర్ కారణంగా తాను మూడు నెలల్లో చచ్చిపోతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఒక వైద్యుడి సూచన మేరకు తన మెదడులోని జ్ఞాపకాలన్నింటినీ కాపీ చేసి మరో వ్యక్తిలో పెట్టి తనకు మరణం లేకుండా చేసుకోవాలని అనుకుంటాడు బిగ్ బుల్. అందుకోసం శంకర్ బుర్రనే వాడుకోవాలనుకుంటాడు. మరి ఈ ప్రయత్నం ఎంతమేర ఫలించింది.. మరో వైపు తాను చంపాలనుకున్న వ్యక్తి తాలూకు మెమొరీనే తన బుర్రలోకి రావడంతో శంకర్ ఎలా స్పందించాడు.. తన పగ ఏమైంది? ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.

# సగం ఇంపాక్ట్!

**కథనం-విశ్లేషణ:**

పూరి జగన్నాథ్ అంటే తెలుగులో హీరోయిజాన్ని రీడిఫైన్ చేసిన చేసిన దర్శకుడు. పూరి జగన్నాథ్ అంటే పేలిపోయే డైలాగులకు కేరాఫ్ అడ్రస్. పూరి జగన్నాథ్ అంటే.. మామూలు కథల్ని కూడా మ్యాజికల్ స్క్రీన్ ప్లేతో పరుగులు పెట్టించే మెజీషియన్. కానీ ఇదంతా గతం. మాఫియా కథల మత్తులో చిక్కుకోక ముందు వరకు సినిమా సినిమాకు వైవిధ్యం చూపిస్తూ ప్రేక్షకులను ఉర్రూతలూగించేవాడు. కానీ మాఫియా కథలను తిప్పి తిప్పి తీయడం మొదలయ్యాక ఆయన క్రియేటివిటీ అటకెక్కేసింది. సినిమా సినిమాకూ పతనం అవుతూ.. తనను పిచ్చిగా అభిమానించిన ప్రేక్షకులే దండం పెట్టే స్థాయికి చేరుకున్నాడు. పూరి మీద పూర్తిగా ఆశలు కోల్పోతున్న దశలో ఆయన్నుంచి వచ్చిన ఓ మెరుపు.. ఇస్మార్ట్ శంకర్. అదేమీ గొప్ప సినిమా కాకపోయినా.. తన మూస కథల నుంచి కొంచెం బయటికి వచ్చి మెమెరీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అనే కాస్త భిన్నమైన కాన్సెప్ట్‌ను మాస్ స్టయిల్లో ప్రెజెంట్ చేస్తూ ప్రేక్షకులను మెప్పించగలిగాడు పూరి. అదిరిపోయే సంగీతం.. రామ్ ఎనర్జీ కూడా తోడై 'ఇస్మార్ట్ శంకర్' ఊహించని విజయాన్నందుకుంది. ఐతే దానికి కొనసాగింపుగా వచ్చిన 'డబుల్ ఇస్మార్ట్'లో మాత్రం ఆ స్థాయి మెరుపులు కనిపించలేదు. ఆల్రెడీ చూసేసిన కాన్సెప్ట్.. సాధారణంగా సాగిపోయే కథనం.. సోసోగా అనిపించే డ్రామా.. యావరేజ్ మ్యూజిక్.. ఇవన్నీ కలగలిసి 'డబుల్ ఇస్మార్ట్'ను ఓ మోస్తరు సినిమాగా మార్చాయి. 'ఇస్మార్ట్ శంకర్'ను ప్రత్యేకంగా మార్చింది అందులో మాస్‌ను ఉర్రూతలూగిస్తూ సాగిన పాటలు.. బ్యాగ్రౌండ్ మ్యూజిక్.. ప్రేక్షకులకు కొత్తదనం పంచిన 'చిప్' కాన్సెప్ట్.. రామ్ ఎనర్జిటిక్ పెర్ఫామెన్స్. ఐతే 'డబుల్ ఇస్మార్ట్'లో ఈ ఆకర్షణలన్నీ డబుల్ అవుతాయని అనుకుంటే.. సగం అయ్యాయి.

పూరి జగన్నాథ్ సినిమా అనగానే చుట్టూ పెద్ద గ్యాంగునేసుకుని ప్రపంచాన్ని గడగడలాడించే మాఫియా డాన్.. అతడి కోసం వెతికే పోలీసులు.. ఈ సెటప్ చాలా కామన్. ఈ తరహా విలన్ పాత్రతో సంజయ్ దత్ ఎంట్రీ ఇవ్వడంతోనే పూరి మరోసారి అలవాటైన 'మాఫియా' మసాలానే మళ్లీ వడ్డించబోతున్నాడని అర్థమైపోతుంది. సంజయ్ దత్ చేస్తున్నాడు కాబట్టి అతనైనా ఈ పాత్రకు ఏమైనా ప్రత్యేకత చేకూరుస్తాడేమో అని ఆశిస్తాం. కానీ విషయం లేని పాత్రను ఏదో మొక్కుబడిగా చేసుకుపోయాడే తప్ప దాన్ని స్పెషల్ గా మార్చలేకపోయాడు సంజు.

ప్రథమార్థంలో 'డబుల్ ఇస్మార్ట్' ఎగుడు దిగుడుగా సాగుతుంది. రామ్ తన ఎనర్జీతో కొన్ని సీన్లను నిలబెట్టాడు. రొమాంటిక్ ట్రాక్ మాత్రం మరీ రొటీన్ అనిపిస్తుంది. హీరోయిన్ని వెంటాడి వేధించి ప్రేమలో పడేసే ట్రాక్ లను పూరి ఎప్పుడు విడిచిపెడతాడో మరి. 20 ఏళ్ల ముందు 'ఇడియట్'లో చూసిందే ఇప్పుడు 'డబుల్ ఇస్మార్ట్'లో కూడా చూస్తాం. హీరోయిన్ పాత్ర చాలా గందరగోళంగా తయారైంది. కానీ కావ్య గ్లామర్ మాత్రం యువ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ప్రథమార్ధంతో పోలిస్తే రెండో సగంలో 'డబుల్ ఇస్మార్ట్' మెరుగ్గా అనిపిస్తుంది. కథలో కొన్ని మలుపులు.. మాస్ మూమెంట్స్ తో పూరి ఎంగేజ్ చేయగలిగాడు. క్లైమాక్స్ మాస్‌ను మెప్పిస్తుంది. ఇక కథతో సంబంధం లేకుండా సాగే ఆలీ కామెడీ ఏమాత్రం వర్కవుట్ కాలేదు. ఈ మధ్య కాలంలో ఇంత జుగుప్సాకరమైన కామెడీ తెలుగు సినిమాలో రాలేదంటే అర్థం చేసుకోవచ్చు. ఒకప్పటి పూరి సినిమాల్లో ఆలీ కామెడీ ట్రాక్స్ గుర్తు చేసుకుంటే.. ఇది పేలవంగా అనిపిస్తుంది. మొత్తంగా చూస్తే.. 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్ అంటే ప్రేక్షకులు ఊహించుకునే స్థాయిలో 'డబుల్ ఇస్మార్ట్' లేదు. కాకపోతే కొన్ని మాస్ మూమెంట్స్ వల్ల ఆ వర్గం ప్రేక్షకులకు పర్వాలేదనిపించవచ్చు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

**నటీనటులు:**

రామ్ 'ఇస్మార్ట్ శంకర్' తాలూకు ఎనర్జీని ఇందులోనూ కొనసాగించాడు. మాస్ ప్రేక్షకులను అలరించేలా కనిపించాడు. 'ఇస్మార్ట్ శంకర్'లో అతణ్ని మెచ్చిన వాళ్లకు ఇందులోనూ అతను నచ్చుతాడు. పాత్రలో వేరియేషన్లు చూపించాల్సిన చోట అతను తన ప్రత్యేకతను చాటుకున్నాడు. పాత్రకు అనుగుణంగా సంజయ్‌దత్‌ను బాగానే ఇమిటేట్ చేశాడు. హీరోయిన్ కావ్య థాపర్ సినిమా అంతటా గ్లామర్ ఒలకబోస్తూనే సాగింది. ఆమెను కథానాయికలా కాకుండా ఒక వ్యాంప్ తరహాలో చూపించాడు పూరి జగన్నాథ్. కనిపించిన ప్రతి సన్నివేశంలోనూ క్లీవేజ్ షో చేసింది కావ్య. కొంచెం భారీ అవతారం కావడం వల్ల రామ్ పక్కన ఆమె ఆమె సూట్ కాలేదు. సంజయ్ దత్ చూడ్డానికి బాగున్నాడు కానీ.. తన పాత్రలో కానీ.. నటనలో కానీ ఏ విశేషం కనిపించదు. చాలా మొక్కుబడిగా తన పాత్రను చేసినట్లు అనిపిస్తుంది. ఆ స్థాయి నటుడి వల్ల సినిమాకు చేకూరాల్సిన ప్రయోజనం ఏమీ దక్కలేదు. ఆలీ చేసిన అడవి మనిషి పాత్ర జుగుప్సాకరంగా సాగింది. ప్రతి సన్నివేశంలోనూ ఆలీతో అసభ్యకరమైన సంజ్ఞలు చేయిస్తూ దాన్నే కామెడీ అనుకుని నవ్వుకోమన్నాడు పూరి. షాయాజీ షిండే ఓవరాక్షన్ భరించడం చాలా కష్టం. ప్రగతి కూడా అంతే. హీరో తల్లి పాత్రలో ఝాన్సీ మాత్రం కనిపించిన కాసేపు ఆకట్టుకుంది. గెటప్ శీను కూడా ఓకే.

**సాంకేతిక వర్గం:**

'ఇస్మార్ట్ శంకర్'కు తన సంగీతంతో హీరోగా మారాడు మణిశర్మ. ఆ పాటలు యువతను.. మాస్ ప్రేక్షకులను ఒక ఊపు ఊపేశాయి. కానీ 'డబుల్ ఇస్మార్ట్'లో మణిశర్మ ఆ స్థాయిలో ఇంపాక్ట్ చూపించలేకపోయాడు. పాటలు బాలేవు అనలేం కానీ.. 'ఇస్మార్ట్ శంకర్' రేంజిలో మాత్రం లేవు. ఏదో అలా టైంపాస్ చేయించి వెళ్లిపోతాయి. నేపథ్య సంగీతం బాగానే సాగింది. శ్యామ్ కె.నాయుడు–జియాని గియానెలి కలిసి అందించిన ఛాయాగ్రహణం బాగానే సాగింది. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. ఈ చిత్రాన్ని స్వయంగా నిర్మించిన రైటర్ కమ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్.. తన నుంచి అభిమానులు ఆశించే ఫైర్ చూపించలేకపోయాడు. ఐతే 'లైగర్' తరహాలో ప్రేక్షకుల హింస అయితే పెట్టలేదు. అదే సమయంలో పూర్తిగా ఫామ్ కూడా అందుకోలేదు. కొన్ని మాస్ మూమెంట్స్.. డైలాగ్స్ వరకు పూరి ఓకే అనిపించాడంతే.



# డబ్బు పెట్టి కొనాల్సిన నిద్ర!

నిద్ర పట్టని ప్రపంచం నిద్రకోసం నిద్రాహారాలు మాని నిరీక్షిస్తూ ఉంటుంది. కొన్ని సెకన్లు కాగానే కనురెప్పలు అసంకల్పితంగా పడడానికి వీలుగా కనురెప్పల వెనుక తడి ఉంటుంది. కంటి తడి లేకపోతే శాస్త్రీయంగా కనుగుడ్డుకు రక్షణ ఉండదు. గుండెతడి లేకపోతే మనిషికి విలువ ఉండదు. కనురెప్ప వేసే కాలమే నిమిషం. దేవతలకు మనలాగా కనురెప్పలు పడవు కాబట్టి వారు అనిమేషులు. కనురెప్ప పడినంత సహజంగా, వేగంగా నిద్ర పట్టాలి. కానీ.. ఇది చెప్పినంత సులభం కాదు. కొందరు నిద్రకోసం పరితపిస్తారు. నిద్రకు వేళాయెరా! అని తమను తాము జోకొట్టుకుంటూ సంగీతం వింటూ రాత్రంతా నిర్నిద్ర గీతాలు విని తరిస్తూ ఉంటారు. కొందరికి మాత్రల్లో నిద్ర దొరుకుతుంది. కొందరికి మద్యంలో దొరుకుతుంది. కొందరికి ఏసీల్లో దొరుకుతుంది. తమకు నిద్ర ఎందుకు పట్టడం లేదని కొందరు నిద్రపోతున్న వారిని తట్టి లేపి నిలదీస్తుంటారు. నిద్ర లేమి ఒక జబ్బు అని కొందరి భయం. నిద్ర లేమి ఒక మానసిక సమస్య అని కొందరి ఆందోళన.

సర్వంసహా చక్రవర్తి హంసతూలికా తల్పం మీద పడుకున్న నిద్ర, పక్కనే కటికనేల మీద ఆయన బంటు పడుకున్న నిద్ర రెండూ ఒకటే అన్నాడు అన్నమయ్య. 'కునుకు పడితె మనసు కాస్త కుదుట పడతది.. కుదుట పడ్డ మనసు తీపి కలలు కంటది' అని శాస్త్రీయ నిరూపణను పాటలో బంధించి జోలపాడాడు ఆత్రేయ. నిజానికి నిద్ర విశ్రాంతి స్థితి. మెదడు, శరీరం బలం కూడగట్టుకోవడానికి అనువైన సమయం. ప్రతి ఉదయం నూతనోత్సాహంతో పరుగులు పెట్టడానికి నిద్ర పెట్టుబడి. ఉత్ప్రేరకం. జీర్ణక్రియకు, ఆరోగ్యానికి అత్యవసరం.

రాత్రి ఉద్యోగాలు, రాత్రి రాచకార్యాలు, అర్ధరాత్రి దాటినా టీవీ, స్మార్ట్ ఫోన్లు చూస్తుండడాలు.. ఇలా కారణమేదైనా నైట్‌లైఫ్‌ను ఎంజాయ్ చేయడమన్నది ఇప్పుడు దానికదిగా ఒక ఆనందం. ఒక నవీన సంస్కృతి. పగటి నిద్ర పనికి చేటు. రాత్రి మేల్కొలుపు ఒంటికి చేటు. 'గూట్లో దీపం – నోట్లో ముద్ద – కంటికి కునుకు' ..ఒకప్పటి సామెత. చుక్కలు పొడిచే వేళకు ఆదమరచి నిద్రపోవాలి. సూర్యుడు పొడవకముందే నిద్రలేవాలి.

కొందరు కళ్లు తెరిచి పడుకోగలరు. కొందరు ఎక్కడైనా పడుకోగలరు. కొందరు నడుస్తూ పడుకోగలరు. కొందరు నిద్రలోనే పోతారు. కొందరు నిద్రపోకుండానే పోతుంటారు. కొందరు సరిగ్గా నిద్రకు ముందే భూత ప్రేత పిశాచ శాకినీ ఢాకినీ కథల సీరియళ్లు, హారర్ సినిమాలు చూసి నిద్రకు దూరమవుతారు. లేదా అలాంటి మనుషులను తలచుకుని తలచుకుని నిదురరాని రాత్రిళ్లు గడుపుతుంటారు.

కుంభకర్ణుడి నిద్ర యుగయుగాలుగా ఒక కొలమానం. సామాన్యులు అందుకోలేని నిద్ర అది. ఊర్మిళ నిద్ర కూడా జగద్విదితమే. భారతంలో రాయబార ఘట్టంలో కపటనిద్రలు, దొంగనిద్రలు మనకు తెలిసినవే. యోగనిద్ర యోగవిద్యతో మాత్రమే సాధ్యమయ్యేది. ఇక ఎప్పటికీ లేవలేనిది శాశ్వత నిద్ర. తెలుగు సాహిత్యంలో ఇంకెవరూ వాడని 'పెద్ద నిద్ర(మరణం)' అన్న మాటను శ్రీనాథుడు ప్రయోగించాడు. నిద్రపోయే ముందు కలలో రాక్షసులు వచ్చి గొడవచేయకూడదని –

*'రామస్కందం హనూమంతం వైనతేయం వృకోదరం శయనే యస్య స్మరణం దుస్వప్నం తస్య నస్యతి'.. అని శ్రీరామచంద్రుడు, కుమారస్వామి, హనుమంతుడు, గరుత్మంతుడు, భీముడు– అయిదుగురు వచ్చి మన నిద్రను రక్షించాల్సిందిగా ప్రార్థిస్తున్నాం.*

నిద్రలేవగానే.. 'కరాగ్రే వసతే లక్ష్మీః కరమధ్యే సరస్వతీ.. కరమూలే స్థితే గౌరీ ప్రభాతే కర దర్శనమ్' అని లక్ష్మి, సరస్వతి, పార్వతి రోజంతా చేయి పట్టి నడిపించాలని నిద్రలేచి కళ్లు తెరుస్తున్నాం.

నిద్రలో కలలు నిజమనుకుని కొందరు మేలుకున్నాక నాలుక కరుచుకుంటారు. కొందరు మెలకువలోనే కలలు కంటూ ఉంటారు. రామాయణంలో త్రిజట స్వప్నం నిజమయ్యింది కాబట్టి మన కలలు కూడా నిజం కాకపోవు అని స్వప్నశాస్త్రం చుట్టూ తిరుగుతూ ఉంటాం. పగలు చూస్తే కొందరు రాత్రి కలలోకి వస్తారు. దుస్వప్నాలు రాకుండా కాపాడాల్సిందిగా ప్రార్థనలు కూడా ఉన్నాయి. లేస్తే మనుషులు కారు కాబట్టి కొందరు త్వరగా లేవరు. రాముడికి విశ్వామిత్రుడు కౌసల్యా సుప్రజా రామా! అని అందంగా, శ్రావ్యంగా మేలుకొలుపు పాడాడు. మనకు పాలవాళ్లు, పేపర్ బాయ్‌లు, ఇంకెవరో తలుపులు బాదుతూ మేలుకొలుపు పాడతారు. వెంకన్నకు అన్నమయ్య జోలపాట పాడాడు. భద్రాద్రి రామయ్యకు రామదాసు జోలపాట పాడాడు. అయోధ్య రామయ్యకు త్యాగయ్య జోలపాట పాడాడు. మనకెవరు పాడతారు జోలపాటలు?

ఆకలి రుచి ఎరుగదు, నిద్ర సుఖమెరుగదు. అలసిన శరీరం హాయిగా విశ్రాంతి తీసుకోవాలి. మనసులో వేన వేల ఆందోళనలు, భయాలు, బాధలు, ఆలోచనలు ఎగసి ఎగసి పడుతుంటే నిద్ర రమ్మన్నా రాదు. జీవితం ఎప్పుడూ యుద్ధమే. గెలిచినా, ఓడినా యుద్ధం ఆగదు. దైనందిన జీవితంలో ఏ రోజుకారోజు పోరాటమే. ఈ పోరాటానికి తగిన శక్తిని కూడగట్టి ఇచ్చేది నిద్ర ఒక్కటే. నిద్ర ఎక్కువయితే నిద్ర మోహం. తక్కువయితే నిద్రకు మోహం వాచిన ముఖం.

నిదురించే తోటలోకే పాటలు వస్తాయి. వచ్చి కొమ్మల్లో రెమ్మల్లో పూలను పూయిస్తాయి. కలలకు రంగులద్దుతాయి. గాలులకు గంధం పూస్తాయి.

'సడిసేయకో గాలి!? సడిసేయబోకే!? బడలి పుడమి ఒడిలో జగతి నిదురించేనే! చిలిపి పరుగులు మాని కొలిచిపోరాదే.. ఏటి గలగలకే ఎగిరి లేచేనే.. ఆకు కదలికలకే అదరి చూసేనే.. నిదుర చెదరిందంటే నే నూరుకోనే.. పండు వెన్నెల నడిగి పాన్పు తేరాదే.. నీలిమబ్బుల దాగు నిదుర తేరాదే.. విరుల వీవన పూని విసిరిపోరాదే..'

అని రాజమకుటం సినిమాలోలా రామారావును నిద్రపుచ్చడానికి దేవులపల్లి గీతం పాడిన రాకుమారిలా మనల్ను ఒడిలో పెట్టుకుని నిద్రపుచ్చే భామామణి లేదని బాధపడకుండా ఇప్పుడు 'స్లీప్ మేకర్స్' సిద్ధమవుతున్నారు. చైనాలో మొదలైన స్లీప్ మేకర్స్ నేడో, రేపో భారత్‌లో కూడా రాకుండాపోరు. పైగా 'స్లీప్ మేకింగ్' మంచి వ్యాపారం కూడా.

చైనాలో ఉద్యోగులు, యువకులు పనిలో పడి యంత్రాల్లా తయారైపోయారు. శరీరానికి విశ్రాంతి లేదు. మనసుకు ఉల్లాసం లేదు. కంటి మీద కునుకు లేదు. దాంతో చిత్రవిచిత్రమైన ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ఇవన్నీ లైఫ్ స్టయిల్ జబ్బులే తప్ప మందులతో నయమయ్యేవి కావని వైద్యులు నెత్తీ నోరూ కొట్టుకుంటున్నారు.

ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది. ప్రతి సమస్యలో ఒక వ్యాపార అవకాశం ఉంటుంది. అలా చైనాలో నిద్రకోసం మోహం వాచినవారిని నిద్రపుచ్చడానికి 'స్లీప్ మేకర్స్'ను పంపే ఏజెన్సీ పుట్టుకొచ్చింది. మొదట ఇదేమి చోద్యం? అని అందరూ నవ్వుకున్నారు. ఇప్పుడు ఆ ఏజెన్సీ వ్యాపారం ఆకాశమే హద్దుగా దూసుకుపోతుంటే నిద్రలో ఇంత వ్యాపారం దాగి ఉందా! అని ఆశ్చర్యపోతున్నారు.


నిద్రపుచ్చే స్లీప్‌మేకర్స్!

స్లీప్ మేకర్స్ మన గురించి అన్ని వివరాలు తెలుసుకుని.. మన ఇష్టాయిష్టాల ప్రకారం మన పక్కన పడుకుని కథలు చెబుతూ జోకొడతారు. జోల పాటలు పాడతారు. గంటకు ఇంత అని ఫీజు వసూలు చేస్తారు. పక్కమీద పరాయి మనిషితో పడుకోవడం లాంటి నైతిక విషయాల మీద చర్చ వేరే సంగతి. స్లీప్ మేకర్స్ వల్ల హాయిగా నిద్ర పడుతోందా! లేదా! అన్నంతవరకే ప్రస్తుత చర్చ. పిండి కొద్దీ రొట్టె అన్నట్లు ఇకపై డబ్బు కొద్దీ నిద్ర అనుకోవాల్సిన రోజులు రావచ్చు!

*దబ్బులెవరికీ ఊరికే రావు–*
*నిద్ర ఎవరికీ ఊరికే రాదు.*
*దబ్బు చెట్లకు కాయదు–*
*నిద్రకు దబ్బులు కాయాలి!*

నిదురించే తోటలోకి శేషేంద్ర పాటను పట్టుకొచ్చి కొమ్మకు కట్టేశాడు. నిదురించే వ్యాపారంలోకి చైనా 'స్లీప్ మేకర్స్'ను పట్టుకొచ్చింది!!

**- పమిడికాల్వ మధుసూదన్**



## నిరుపేద కుటుంబానికి రూ.45వేలు సాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమాజ సేవలో అందరూ ముందుండాలని, అందులో ఉండే ఆనందం వేరని, ప్రతిఒక్కరూ సేవాతత్వం అలవరచుకోవాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహనరావు అన్నారు. పీఎన్ కాలనీలో నివాసముంటున్న జె.లక్ష్మణరావు గత కొంతకాలంగా లివర్‌కుసంబంధించిన కేన్సర్‌తో బాధపడుతూ గురువారం మరణించారు. భార్య వికలాంగురాలు. ఇద్దరు చిన్నపిల్లలతో జీవితాన్ని నెట్టుకొస్తోంది. వీరికి ఎటువంటి ఆధారం లేదని తెలుసుకుని లక్ష్మణరావు కుటుంబాన్ని ఆదుకోవాలనే తపనతో ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమాశంకర్ స్టేటస్ పెట్టగా, స్పందించిన పాతపట్నానికి చెందిన సైలాడ సతీష్ తన మిత్ర బృందంతో కలసి సేకరించిన రూ.45వేలు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహనరావు చేతుల మీదుగా కుటుంబానికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నిత్యసేవకులు ఉర్లం శివతేజ, నంది ఉమాశంకర్, పొదుగు చరణ్, బొట్టా సాయి, బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



## పేదవారి ఆకలి తీర్చే మహత్తర కార్యక్రమం

(సత్యంన్యూస్, విజయనగరం)

పేదవారికి అన్నం పెట్టి వారి ఆకలి తీర్చే మహత్తర కార్యక్రమమే అన్న క్యాంటీన్ల పునః ప్రారంభమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా, ప్రకాశం పార్క్ సమీపంలో రెండుచోట్ల అన్న క్యాంటీన్‌లను కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుతో కలిసి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రారంభించారు. అలాగే మున్సిపల్ స్టేడియం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అప్పలనాయుడు మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను 2019 వరకు రాష్ట్రంలో విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. భారతదేశంలోనే మంచి పేరున్న పథకం ఇదని పేర్కొన్నారు.



## సమాచార శాఖ ఉద్యోగులకు అవార్డులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో డివిజనల్ పీఆర్వోగా పని చేస్తున్న ఎన్.రాజు, పౌర సంబంధాల అధికారిగా పనిచేస్తున్న ఎస్వి సత్యప్రసాద్‌లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన పంద్రాగస్టు కార్యక్రమంలో వీరికి ప్రశంసా పత్రాలను అందజేశారు. అంకిత భావంతో విధి నిర్వహణ, అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను వీరిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీతలు రాజు, సత్యప్రసాద్‌లను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కే.చెన్నకేశవరావు, డీపీఆర్వో బాలమాన్ సింగ్, డీఐపీఆర్ శాఖలోని పలువురు ఉద్యోగులు అభినందించారు.



## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

(సత్యంన్యూస్, టెక్కలి)

స్వాతంత్ర్య దినోత్సవం, అభయం ఫుడ్‌బ్యాంక్ వార్షికోత్సవం సందర్భంగా




టెక్కలి అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో రక్తదాన శిబిరాన్ని టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. సెక్రటరీ లాడి కామేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఈ శిబిరంలో సుమారు 75 మంది రక్తదానం చేశారు. మొదటి రక్తదాత దుంప సూర్య ఒక అంధుడు కావడం విశేషం. రక్తదాతలకు అభయం సేవా సంఘం తరపున జ్ఞాపిక, మెడల్, సర్టిఫికెట్‌తోపాటు 10రకాల పోషకాహార కిట్టును టెక్కలి జిల్లా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ సూర్యారావు, డాక్టర్ రాజేష్, డాక్టర్ బి.సునీత, తంగుడు విష్ణు, దేవాది సునీత, కోళ్ల వసంత్ చేతుల మీదుగా చేశారు. కార్యక్రమంలో అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు, సెక్రటరీ లాడి కామేశ్వరరావు, ట్రెజరర్ శ్రీనివాస్ బెహర, సంఘ సభ్యులు ఎన్.సింహాచలం, పిల్లల రమేష్, అద్దాల వీరభద్రాచారి, ధర్మవరపు పూర్ణాచారి, కంచరాన రాజు, మూగి దుర్గారావు, జగదీశ్ పొరిడ, ఉంగరాల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## డేవిడ్ టీమ్ సేవలు అమూల్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డేవిడ్ టీం సేవలు అమూల్యమని, డేవిడ్ మాదారపు, ప్రదీప్ బెహరా, రాజశేఖర్ గోడబా నేడు అందించిన సహకారం గొప్పదని, అమ్మ యశోదమ్మ జ్ఞాపకార్థం స్వచ్ఛంద సంస్థను స్థాపించి, అనేక కార్యక్రమాలను నిర్వహించటం గొప్ప విషయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అంపోలుకు చెందిన ఉట్ల హేమంత్ కుమార్ గత కొంతకాలంగా లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. ఉన్న ఉద్యోగం కూడా చెయ్యలేక, జీవనం కొనసాగిస్తున్నారు. వారానికి ఒక ఇంజక్షన్ సుమారు రూ.7,500 ఖర్చుతో తీసుకోవాల్సిన పరిస్థితి, ఎటువంటి ఆధారం లేక, చాలా ఇబ్బందిపడుతున్నారు. వీరి పరిస్థితిని జేసీ మణిశర్మ, నిరంతర సేవకులు ఉర్లం శివతేజకు తెలపగా, స్పందించిన ఆయన నగరానికి చెందిన డేవిడ్ మాదారపు టీం అందించిన సహకారంతో అత్యవసరంగా మూడు ఇంజెక్షన్లను గొండు శంకర్ చేతుల మీదుగా శుక్రవారం అందించి మానవత్వం చాటుకున్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే గొండు శంకర్‌కు వీరి కుటుంబ పరిస్థితిని డేవిడ్ మాదారపు వివరించగా, తక్షణమే స్పందించి రిమ్స్ సూపరింటెండెంట్, జిల్లా ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించి ప్రభుత్వ పింఛను అందేలా చర్యలు తీసుకొని, అన్ని విధాలా అండగా ఉంటామని, శివతేజ, డేవిడ్ సేవలు కొనసాగాలని అన్నారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ప్రదీప్ బెహరా, రాజశేఖర్ గోడబా, ఉర్లం శివతేజ, నంది ఉమా శంకర్, బొట్టా సాయి, పోసుగు చరణ్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## పేదవాడి ఆకలి తీర్చడమే టీడీపీ ఆశయం

(సత్యంన్యూస్, పలాస)

పేదవాడి ఆకలి తీర్చడమే తెలుగుదేశం పార్టీ ఆశయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాసలో అన్న క్యాంటీన్‌ని ఆమె ప్రారంభించి స్వయంగా వడ్డించారు. అనంతరం క్యూలైన్‌లో నిల్చొని టిఫిన్ చేశారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లను విమర్శించిన వైకాపా నేతలు కూడా ఇప్పుడు అన్న క్యాంటీన్‌లో తినొచ్చని అన్నారు. ప్రస్తుతం ఐదు రూపాయలకు పెన్ను కూడా రావడం లేదని, కానీ సీఎం చంద్రబాబు అదే ఐదు రూపాయలకు అన్నం పెడుతున్నారని ఎమ్మెల్యే శిరీష చెప్పారు.









# సేవాలోపమే రిమ్స్ స్పెషాలిటీ!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సర్వజన ఆస్పత్రిలో పనిచేసే వైద్యులు, ఇతర ఉద్యోగుల హాజరును, పనివేళలను పర్యవేక్షణ కొరవడుతోంది. దీనికోసం తొలుత ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ డివైజ్‌లు పూర్తి స్థాయిలో పని చేయకపోవడంతో ప్రత్యామ్నాయంగా ఫేస్ రికగ్నిషన్ యాప్ హాజరు ప్రవేశపెట్టారు. దీన్ని కూడా దుర్వినియోగం చేస్తున్నారు. పనిచేసే ప్రాంతానికి వంద మీటర్ల పరిధిలో ఎక్కడి నుంచైనా హాజరు వేసుకునే వెసులుబాటు ఇందులో ఉండటమే అధికారులకు, సిబ్బంది అనుకూలంగా మారింది. రిమ్స్ గేట్‌లోకి అడుగు పెట్టకుండానే ఫోన్‌లో హాజరు వేసేసుకుని వెనక్కి వెళ్లిపోవడం నిత్యకృత్యమైంది. డాక్టర్లు రాకపోవడంతో గంటల తరబడి నిరీక్షణ తర్వాత రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. రూ.లక్షల్లో వేతనాలు తీసుకుంటున్న వైద్యులు కొన్ని గంటలు కూడా పనిచేయడం లేదు. ఇలా వస్తారు.. అలా వెళ్లిపోతారు. ఏళ్ల తరబడి ఇదే తంతు. అయినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంలేదు. ఆస్పత్రిలో ప్రముఖ వైద్య నిపుణులు, సీనియర్ వైద్యులు ఉన్నారు. బోధనాస్పత్రి కావడంతో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జూనియర్ డాక్టర్లు, సివిల్ సర్జన్లు అందుబాటులో ఉన్నారని చెబుతున్నా రోగులకు మాత్రం సరైన సేవలు అందడం లేదు. దీనికి మంగళవారం సాయంత్రం జరిగిన ఘటనే నిదర్శనం. రోడ్డు ప్రమాదంలో గాయపడి తీవ్ర రక్తస్రావమైన క్షతగాత్రుడిని చికిత్స కోసం సాయంత్రం 4.30 సమయంలో రిమ్స్‌కు తీసుకెళ్తే గంటన్నరకు పైగా అంబులెన్స్‌లోనే ఉంచేశారు. వైద్యులు, సిబ్బంది స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులే స్ట్రెచర్ తీసుకువచ్చి అంబులెన్స్ నుంచి బాధితుడిని దించి క్యాజువాలిటీకి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు స్పందించకపోవడంతో బాధితుడి కుటుంబ సభ్యులు కలెక్టర్ వేశారన వార్త సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడంతో కొందరు జూనియర్ డాక్టర్లు, సిబ్బంది వచ్చి బాధితుడి వివరాలు రాసుకొని ప్రథమ చికిత్స చేసి విశాఖకు రిఫర్ చేసి చేతులు దులిపేసుకున్నారు. రిమ్స్‌లో ట్రామాకేర్ యూనిట్, న్యూరాలజీ నిపుణులు ఉన్నా విశాఖకు రిఫర్ చేయడం ఇక్కడి వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెబుతున్నారు. నెల రోజుల క్రితం కూడా ఒక విద్యార్థి బస్సు ఎక్కుతున్న క్రమంలో టైర్ కింద కాలుపడి తీవ్ర గాయమైంది. దీంతో బాధితుడిని రిమ్స్‌కు తీసుకెళ్లారు. కానీ వైద్యులు తీరిగ్గా రెండు గంటల తర్వాత వచ్చి పరీక్షించి బ్యాండేజీ కట్టి న్యూరాలజీ నిపుణులు లేరని చెప్పి విశాఖకు రిఫర్ చేసేశారు. వైద్య పరీక్షలు చేయించాలన్నా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి.

**ఓపీ వేళల్లో పాఠాలా?**

సిబ్బంది బాధ్యతారాహిత్యం వల్ల కూడా రిమ్స్‌కు వచ్చే రోగులు ఇబ్బందుల పాలవుతున్నారన్న ఆరోపణలున్నాయి. సకాలంలో స్పందించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్న విమర్శలు ఉన్నాయి. రిమ్స్‌లో వైద్యులతో పాటు సిబ్బంది కొరత ఎప్పటినుంచో ఉంది. సుమారు 231 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. బోధనాస్పత్రి కావడంతో సరిగ్గా ఓపీ సమయంలోనే వైద్య విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి వైద్యులు వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వైద్య విద్యార్థులకు ఉదయం పూట ట్యూటర్లు పాఠ్యాంశాలు బోధించాలి. ప్రాక్టికల్స్‌ను మాత్రం స్వయంగా ఓపీతో పాటు వార్డుల్లోనే రోగులకు చికిత్స చేస్తూనే విద్యార్థులకు నేర్పించాల్సి ఉంటుంది. దీన్ని విస్మరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ కేసుల విషయంలో మిగతా కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులకు రిమ్స్ ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోతుందని విమర్శలు ఉన్నాయి. మిగతా ఆస్పత్రులతో పోలిస్తే రిమ్స్‌లో పది శాతమే ఆరోగ్యశ్రీ చికిత్సలు జరుగుతున్నాయి.

**స్థాయి పెరిగినా.. పెరగని రోగులు**

రిమ్స్‌లో వైద్య సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రతి రోజూ సుమారు 800 వరకు రోగులు ఓపీలో నమోదవుతుండగా 200 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చేరుతుండేవారు. ఇప్పటికీ ఇవే గణాంకాలు నమోదవుతున్నాయి. 500 నుంచి 950 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినా రిమ్స్‌లో వైద్య సేవలు అందుకుంటున్నవారి సంఖ్య పెరగలేదు. మధ్యాహ్నం 12 గంటలకే ఓపీ ముగించేసి వెళ్లిపోతున్నారు. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు రిమ్స్ ప్రాంగణంలోకి వచ్చి ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో హాజరు వేసుకొని వెళ్లిపోతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు తప్పనిసరిగా ఆస్పత్రిలో ఉండాలని నిబంధనలు ఉన్నా ఎవరూ ఖాతరు చేయడం లేదు. వైద్యసేవలు అందించాల్సిన సీనియర్లు విధులకు డుమ్మా కొడుతుంటే వారి స్థానంలో జూనియర్ డాక్టర్లు దర్శనమిస్తున్నారు. గైనిక్ విభాగంలో వైద్యులు ఉన్నా నర్సింగ్ సిబ్బందే చికిత్స అందిస్తున్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం వల్ల ఇన్‌పేషెంట్లుగా చేరిన పలువురు అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లిపోతున్న ఉదంతాలు ఉన్నాయి.

**తనిఖీలు, పర్యవేక్షణ నిల్**

గతంలో కలెక్టర్‌గా పనిచేసిన నివాస్ సర్వజన ఆస్పత్రిలో తరచూ తనిఖీలు చేస్తూ వైద్యులతో సమీక్షలు నిర్వహింస్తుండేవారు. ఆతర్వాత వచ్చిన కలెక్టర్లు రిమ్స్ వైపు కన్నెత్తి చూడడం మానేశారు. నివాస్ కుటుంబ సభ్యులకు కూడా ఇక్కడే వైద్యపరీక్షలు నిర్వహించేవారు. విధులకు డుమ్మా కొట్టినవారిపై తక్షణ చర్యలు తీసుకునేవారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సిబ్బందిని హడలెత్తించేవారు. ఆయన తర్వాత ఆ స్థాయిలో ఉన్నతాధికారులు ఎవరూ తనిఖీలు చేపట్టలేదు. వైకాపా హయాంలో మంత్రి సీదిరి ఒకసారి, ధర్మాన మరోసారి సందర్శించారు. రిమ్స్ ఉన్నతాధికారులు తమ ఛాంబర్లలోనే సమావేశాలు నిర్వహించడం, పుస్తకాలు చదువుకోవడం తప్ప రోగులకు వైద్యసేవలు అందుతున్న తీరుపై దృష్టిపెట్టే ఆలోచన చేయడంలేదు. అనుకోని ఘటనలు చోటుచేసుకొని రోగుల బంధువులు ఆందోళనకు దిగితే మధ్యవర్తుల ద్వారా రాజీలు చేసి పంపించేస్తున్నారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై, వైద్యులపై ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ వైద్యులంతా సమావేశమై రిమ్స్ ప్రతిష్టను దిగజార్చుతున్నారంటూ ఆరోపణలును ఖండించి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో రిమ్స్‌ను ఆశ్రయించేవారి సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది.

## 'సత్యం' వెబ్‌పేజీని ప్రారంభించిన కలెక్టర్

(మొదటిపేజీ తరువాయి)

చేస్తుందన్నారు. ఎన్నో ఏళ్ల అనుభవం కలిగిన సీనియర్ పాత్రికేయుల సూచనలు, సలహాలు, వారిచ్చే ప్రోత్సాహంతో పాఠకుల అభిరుచికి అనుగుణంగా ప్రత్యేక కథనాలు, తాజా వార్తలు అందించగలుగుతూ 'సత్యం' ద్వారా మరింత చేరువ కాగలగుతున్నామని వివరించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని 'సత్యం' వెబ్‌పేజీ ద్వారా ప్రతీ రోజు డిజిటల్ పాఠకులకు సమగ్ర సమాచారాన్ని అందించడానికి కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్యం వెబ్ పేజీని తయారు చేసిన ఐటీ విద్యార్థులు రతన్, సాయిరాజ్, రోషన్ నైపుణ్యాన్ని ఉన్నతాధికారులు ప్రశంసించారు. 'సత్యం' వెబ్‌పేజీ ఆవిష్కరణలో డీపీఆర్వో బాలమాన్ సింగ్, సీనియర్ జర్నలిస్టులు శాసపు జోగినాయుడు, కొంక్యాన వేణుగోపాలరావు, సీపాన రమేష్, ఎండీయూ ఆపరేటర్స్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫతీసా బేబీ చందనోత్సవం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ బూబమ్మనగర్‌లోని ఫతీసా బేబీ అమ్మ చందనోత్సవం నగర ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఖురాన్ పఠనం అనంతరం జెండా ఎగురవేశారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో పాటు శ్రీకాకుళం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చందనోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుస్సేనీ మసీదు అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ రఫీ, ఎంఎ బేగ్, జామియా మసీదు అధ్యక్షులు మహిబుల్లా ఖాన్, ఉపాధ్యక్షులు హాజీ సర్ఫరాజ్ భయ్యా, కార్యదర్శి అక్బర్ బాషా, జాయింట్ సెక్రటరీ సుఖుర్ ఖాన్, షాను అదిని, రోషన్ భాష, షేక్ తాజ్, రావు ఖాన్, ఢిల్లీ ఇంజనీరింగ్ భాషా, హాజీ అమీరుల్లా బేగ్, సలీంఖాన్, సయ్య షఫీ, జామియా మసీదు ముక్తి, అబ్దుల్ వహాబ్, సుల్తాన్, అబ్దుల్, డెంటల్ రఫీ, అమాన్, వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ సాదిక్, రియాజ్, నగర జామియా మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు 'స్వాభిమాన్' ప్రారంభం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరని కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని గ్రీవెన్స్ హాల్‌లో విభిన్న ప్రతిభావంతుల వినతుల స్వీకరణ స్వాభిమాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ మహమ్మద్ ఖాన్‌తో కలసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ పనులపై కలెక్టరేట్‌కు వస్తున్న దివ్యాంగుల కోసం ర్యాంపు రత్నాల శ్రీనివాసరావు, మల్లారెడ్డి భాస్కర్ రావు దివ్యాంగుల సంఘ సభ్యులతో రిబ్బన్ కట్ చేయించి ప్రారంభించారు. శ్రీకాకుళం మండలానికి చెందిన మట్ట నీలం యాదవ్‌తో కలెక్టర్ మాట్లాడగా జిల్లాకి అంధుల పాఠశాల, దివ్యాంగులకు జిల్లా ప్రధాన కేంద్రంలో హోం కావాలని కోరగా, అందుకు చర్యలు చేపడతామన్నారు. మందస మండలం సొండిపూడి గ్రామానికి చెందిన వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ కోరిన వెంటనే ర్యాంపు కట్టించి తమతోనే ప్రారభించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన రత్నాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నిజమైన వికలాంగులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం 10 గంటల నుంచి 12 గంటల వరకు జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి కలెక్టర్, జేసీ, జెడ్పీ సీఈవో, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీతో కలసి వినతులు స్వీకరించారు. స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమానికి 46 వినతులు వచ్చాయి. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ నెల మూడవ శుక్రవారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్) కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సలహా మేరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరని, వారు ఆర్టీసీ బస్సుల్లో సులువుగా ప్రయాణించేందుకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో అప్పారావు, డీపీవో వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి కిరణ్‌కుమార్, ఆర్ & బి ఎస్ఈ జాన్ సుధాకర్, ఏఐఈఈ రాజు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ షకీలా, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మీనాక్షి, సీపీవో ప్రసన్న లక్ష్మి, జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు, దివ్యాంగుల సంఘాల సభ్యులు హాజరయ్యారు.

## తిరుమలకు నడకన కూటమి భక్తులు

(సత్యంన్యూస్, విజయనగరం)

చంద్రబాబు నాయుడు, ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలని లావేరు మండలం పాతకుంకాం గ్రామానికి చెందిన టీడీపీ అభిమానులు ఎస్.వెంకటరమణ, సిరిపురం పోలారావు, ఇజ్జు మిరియాబాబు, అల్ల శంకరరావు మొక్కుకున్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రిగా, పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు వారు శ్రీకాకుళం నుంచి తిరుపతికి నడిచి మొక్కు చెల్లించుకునేందుకు బయల్దేరారు. వారిని పూసపాటిరేగ వద్ద విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారి బాగోగులు తెలుసుకొని, వారి ప్రయాణంలో అన్ని సౌకర్యాలు తనే చూసుకుంటానని అన్నారు.



## లచ్చన్న స్ఫూర్తిని కొనసాగించాలి

(సత్యంన్యూస్, పలాస)

స్వాతంత్ర్య సమరయోధుడు, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలు నడిపిన ఉద్యమకారుడు గౌతు లచ్చన్న స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అన్నారు. లచ్చన్న 115వ జయంతి నేపథ్యంలో పలాసలోని సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి ఆయన మనుమరాలు, ఎమ్మెల్యే గౌతు శిరీష పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లచ్చన్న అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వజ్జ బాబురావు, పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గాలి క్రిష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి, రామక్రిష్ణ, చంద్రరావు, అనిల్ శర్మ, చక్రధర్, దడియాల నర్సింహులు, అంబటి క్రిష్ణమూర్తి, నాబెల్లి శ్రీను, కొరికాన శంకర్, స్వరం రాంబాబు, కొండే నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



## తెలుగుజాతి కీర్తికిరీటం సర్దార్ లచ్చన్న

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశంలో కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా అందరూ అభిమానించే నేత సర్దార్ గౌతు లచ్చన్న అని ఇంటాక్ కో-కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గౌతు లచ్చన్న 115వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ డిప్యూటీ గవర్నర్ శాసపు జోగినాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లచ్చన్నకు సముచిత రీతిలో గుర్తింపు, గౌరవం ఇచ్చాయన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాదరావు, డాక్టర్ జి.నారాయణరావు, బగాది జగదీష్, డాక్టర్ అడపా మోహన్ రాజ్, నళినీ సుధాకర్, ఎండ మోహన్, బరాటం శ్రీనివాస్, గుడ్ల జగ్గారావు, పొట్నూరు నాగేశ్వరరావు, పట్నాన రామారావు, శేఖర్, డీఈ గణిరాజు, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.



## బడుగుల ఆశాజ్యోతి సర్దార్ లచ్చన్న



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్తరాంధ్ర నుంచి ఎగసిపడ్డ రాజకీయ కెరటం, జీవితాంతం బలహీనవర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన పేదల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకొని డే & నైట్‌లో ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి అచ్చెన్నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలు నడిపిన ఉద్యమకారుడిగా, రాజకీయ నాయకుడిగా గౌతు లచ్చన్న సాగించిన ప్రయాణం ఆయన్ను మహనీయునిగా నిలబెట్టిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గౌతు శిరీష, గొండు శంకర్, నడికుదిటి ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, చౌదరి బాబ్జి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సేవలకు ప్రశంసలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా పౌరసరఫరాల సంస్థ అరసవల్లి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జిగా పని చేస్తున్న డీటీ సంపతిరావు మురళీకి వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశంసాపత్రాన్ని అందించారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో మురళీ ఉత్తమ సేవలను గుర్తించి జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీనివాసరావు సిఫార్సుతో ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంస్థలో పని చేస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది మురళీని అభినందించారు.



## లక్ష్మీదేవిగా లలితాదేవి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మొండేటివీధిలోని శ్రీ లలిత దేవి సహిత శివ కామేశ్వర వారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ లలితాదేవి అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# జీవో 1108ను రద్దు చేయాలి

### కాకరాపల్లి థర్మల్ వ్యతిరేక పోరాట దీక్షలకు 5110 రోజులు

(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

కాకరాపల్లి థర్మల్ ప్రాజెక్టు కోసం వేలాది ఎకరాల తంపర భూములను ఏపీఐఐసీకి కేటాయిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో నెంబర్ 1108ను రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం వడ్డితాండ్రలో నిరవధిక నిరాహార దీక్షా శిబిరం వద్ద నిర్వహించిన సభలో తాండ్ర మాట్లాడుతూ ఉద్యమకారులపై, ప్రజలపై అక్రమంగా బనాయించిన పోలీసు కేసులన్నీ ఎత్తివేయాలనీ ఆయన కోరారు. ఏపీఐఐసీకి కేటాయించిన భూములను లీజుదారులైన మత్స్యకారులకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర పోరాట సమితి కన్వీనర్ సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ చిత్తడి నేలల పరిరక్షణకు సమరశీల పోరాటాల్ని చేయాల్సిన అవసరం ఉందన్నారు. 1108 జీవో రద్దును కోరుతూ 5110 రోజులుగా నిరవధికంగా సాగుతున్న దీక్షలు దేశ చరిత్రలోనే నిలిచిపోయాయని, దీక్షలు ప్రారంభమై 14 ఏళ్లు పూర్తవుతున్నా పాలకుల్లో స్పందన లేదని విమర్శించారు. ఈస్ట్‌కోస్టు థర్మల్ ప్లాంట్‌కు సంబంధించిన జీవో 1108 రద్దు, తంపర మత్స్యకారులకు లీజు, ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయడంతో పాటు తంపరలో అక్రమ రొయ్యల చెరువులను తొలగించాలని డిమాండ్ చేశారు. కాకరాపల్లి ఉద్యమంలో అసువులు బాసిన జీరు నాగేశ్వరావు, సీరపు ఎర్రయ్య, బత్తిన బారికవాడులకు జోహార్లు అర్పించారు. పోరాట కమిటి నాయకులు వెంకటరావు అధ్యక్షత జరిగిన ఈ సభలో పీవైఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్, కోత మధు, కారుణ్య కేశవ, అనంత హన్నూరావు, మండల గన్ను, ఎన్.పద్మనాభం, ఎం.భాస్కరరావు, అనంతు చిన్నబాబు, కోత రమణ మాట్లాడారు.






వైద్య విద్యార్థులకు, వైద్యులకు రక్షణ కల్పించాలని రిమ్స్ వద్ద మెడికల్ విద్యార్థులు శాంతియుత నిరసన చేపట్టారు. వైద్యులు, వైద్య విద్యార్థుల రక్షణకు ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేయాలని కోరారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.